సాక్షి ఖమ్మం

సోమవారం । 28 । జూలై । 2025



ఉండలేక.. కట్టలేక..

అటవీ అధికారుల ఆంక్షలతో ఇళ్లు కట్టుకోలేక, గుడిసెల్లో ఉండలేక సత్తుపల్లి మండలం తుమ్మల నగర్ గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. 8లో



మెరుగైన సేవలతో...

ఖాతాదారులకు మెరుగైన సేవల ద్వారా బ్యాంకు అభివృద్ధి పథంలో నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాటక రంగానికి నాడు ఘన కీర్తి

- అదనపు కలెక్టర్ పి శ్రీనివాస రెడ్డి



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: నాటక రంగానికి గతంలో ఘన కీర్తి ఉండేదని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'నెల నెలా వెన్నెల' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాడు గ్రామాల్లో సురభి నాటికలు ప్రదర్శించేవారని, వాటిని ప్రజలు ఎంతగానో ఆదరించేవారని చెప్పారు. నాటకాల నుంచే సినిమా రంగం అభివృద్ధి చెందిందని, నెల నెలా వెన్నెల నిర్వాహకులు నాటక రంగానికి జీవం పోస్తున్నారని అభినందించారు. ఇటీవల మలేషియా సినీ అవార్డులు సాధించిన దర్శకులు కొత్తపల్లి శేషు, కమెడియన్ మొగిలి గుణకర్, యామిని, వైదేహి, రవి, అన్నపూర్ణ, గుజ్జరి శ్రీధర్‌బాబును శ్రీనివాసరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, కాళ్ల అనూరాధ, నెల నెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉషోదయ కళానికేతన్ వారు ప్రదర్శించిన 'కిడ్నాప్' నాటిక ప్రేక్షకులను అలరించింది.

జిల్లాకు రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



మాట్లాడుతున్న నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు మంగళవారం జిల్లా పర్యటనకు వస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న ఉదయం 8 గంటలకు నాయకన్ గూడెంలో పార్టీ కార్యకర్తలు రామచంద్రరావుకు స్వాగతం పలుకుతారని, 9 గంటలకు కూసుమంచి శివాలయాన్ని దర్శించుకుంటున్నారని తెలిపారు. 10 గంటలకు ఖమ్మం కాల్వొడ్డు నుంచి బైక్ ర్యాలీగా సప్తపది ఫంక్షన్ హాల్‌కు చేరుకుని అక్కడ జరిగే సభలో పాల్గొంటారని వెల్లడించారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గెంటేల విద్యాసాగర్, ఈవీ.రమేష్, నంబూరి రామలింగేశ్వరావు, జయరాజు, దిద్దుకూరి వెంకటేశ్వర్లు, ఆర్‌వీఎస్ యాదవ్, విజయారెడ్డి, వెంకటనారాయణ, పమ్మి అనిత పాల్గొన్నారు.

బోనకల్ యువతికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నిర్మల

బోనకల్: బోనకల్‌కు చెందిన బాలు నిర్మలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో 'బోయ జంగయ్య కథలో మానవతా దృక్పథం' అనే అంశంపై డాక్టరేట్ లభించింది. ఆచార్య మాదిరెడ్డి ఆండాళమ్మ పర్యవేక్షణలో పరిశోధనలు చేసినందుకు గాను ఆమె ఈ పురస్కారానికి ఎంపిక కాగా, పలువురు అభినందించారు.

ఆరుగురు ఎంపీడీఓల నియామకం

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని ఆరు మండలాలకు ఎంపీడీఓలను నియమిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపాలెం ఎంపీడీఓగా కొండపల్లి శ్రీదేవి, కూసుమంచికి ఏమేడూరి రామచంద్రరావు, కొణిజర్లకు రామిరెడ్డి ఉపేంద్రయ్య, తల్లాడకు ఏనుగు సురేష్‌బాబు, ఏన్కూర్‌కు బి.రంజిత్‌కుమార్, సింగరేణి ఎంపీడీఓగా పెగళ్లపాటి సూర్యనారాయణను నియమించారు. వీరంతా వెంటనే విధుల్లో చేరనున్నారు.

'నవోదయ'లో ప్రవేశానికి ఆహ్వానం

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యాసంవత్సరం 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సెప్టెంబర్ 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీరిలో అర్హులను 2026 జనవరి 7న జరిగే ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

పల్లె ముంగిట డిజిటల్



జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) ఇక నగదు రహిత లావాదేవీలు నిర్వహించనున్నాయి. వీరి ద్వారా ఏర్పాటు చేసే కేంద్రాలతో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆధార్, డిజిటల్, బీమా, ఇతర సేవలు దగ్గర కానున్నాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఈ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం డీఐసీఎస్‌సీ(డిజిటల్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్) ప్రాజెక్టు కింద తొలి దఫా దేశంలోని పది జిల్లాలను ఎంపిక చేయగా.. తెలంగాణ నుంచి ఖమ్మానికి స్థానం దక్కింది. సెర్ప్(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ), సీఎస్‌సీ-ఎస్‌పీవై(కామన్ సర్వీస్ సెంటర్-స్పెషల్ పర్పస్ వెహికిల్) సంయుక్తంగా నిర్వహించే ఈ ప్రాజెక్టులో జిల్లాలోని 153 మంది స్వయం సహాయక సంఘాల మహిళలను ఎంపిక చేశారు. వీరికి ఇందిరా మహిళాశక్తి పథకం ఆధారంగా శిక్షణ ఇచ్చి మోడల్ సీఎస్‌సీ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తారు. తద్వారా సభ్యులకు ఉపాధి లభించడమే కాక గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ కానున్నాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఎస్‌హెచ్‌జీల ద్వారా నగదు రహిత లావాదేవీలు

- దేశవ్యాప్తంగా పది జిల్లాలు.. రాష్ట్రంలో ఖమ్మానికి స్థానం
- జిల్లాలో 153 మంది మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ
- ఆపై గ్రామాల్లో మోడల్ సీఎస్‌సీల ఏర్పాటుకు ప్రణాళిక



శిక్షణ తీసుకున్న మహిళకు బయోమెట్రిక్ మిషన్ అందిస్తున్న కలెక్టర్ అనుదీప్

గ్రామాల్లో డిజిటల్ విప్లవం..

గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలు, నగరాలకు వెళ్లే అవసరం లేకుండా అన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. డీఐసీఎస్‌సీ ద్వారా గ్రామాల్లో సీఎస్‌సీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.35 వేలు మంజూరు చేస్తుంది. సెర్ప్, సీఎస్‌సీ-ఎస్‌పీవీ సంస్థలు జిల్లాను మండలాల వారీ క్లస్టర్లుగా విభజించి, ప్రతీ గ్రామానికి కనీసం ఒక మోడల్ సీఎస్‌సీ ఉండేలా ప్రణాళిక రూపొందించాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సర్టిఫికెట్లు, బ్యాంకింగ్ సేవలు, ఆధార్ అప్‌డేట్, బిల్లుల చెల్లింపు, మీ సేవ ద్వారా అందే సేవలు, నగదు రహిత లావాదేవీలు చేరువవుతాయి. అయితే, ఈ కేంద్రంలో చెల్లింపులన్నీ నగదు రహితంగా జరిగేలా చూస్తారు.

దశల వారీగా శిక్షణ

సెర్ప్, సీఎస్‌సీ-ఎస్‌పీవీ సంయుక్తంగా 153 మంది మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, తొలి దశలో 70 మందికి ఆర్‌ఎస్‌ఈటీఐ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్) ద్వారా ఏడు రోజుల శిక్షణ పూర్తి చేశారు. ఆపై ప్రోత్సాహకంగా మొదటి ఆరు నెలలు రూ.5వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తారు. తద్వారా వారిలో నమ్మకం పెంచడంతో పాటు స్థిరమైన ఉపాధి దిశగా ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక రెండో దశలో మిగిలిన మహిళలకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యాన ఖమ్మంలోని ఐటీ హబ్‌లో ప్రత్యేకంగా ఈడీపీ/డిజిటల్ స్కిల్ శిక్షణ ఇచ్చారు. వీరికి ఉచితంగా బయోమెట్రిక్ పరికరాలు అందించగా, అక్టోబర్ 1 నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో సీఎస్‌సీల ద్వారా డిజిటల్ లావాదేవీలు, ఇతర సేవలు మొదలుకానున్నాయి.

ఆధార్ సేవలకు అనుమతి వస్తే..

మోడల్ సీఎస్‌సీల ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ లావాదేవీలే కాక ఆధార్ సేవలు కూడా అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసి, ఆధార్ అప్‌డేట్ సేవలకు అవసరమైన యూసీఎల్(అప్‌డేట్ క్లెయింట్ లైట్) అనుమతులకు అధికారులు యత్నిస్తున్నారు. ఇవి కూడా మంజూరైతే సీఎస్‌సీ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డుల్లో మొబైల్ నంబర్ మార్పు, చిరునామా సవరణ సేవలు అందించగలుగుతారు.

సేవలు చేరువ అవుతాయి..



బ్యాంకింగ్, బిల్లుల చెల్లింపుల వంటి సేవలు గ్రామీణులకు చేరువవుతాయి. దీంతో పట్టణాలకు వెళ్లే ఇబ్బంది ఉండదు. శిక్షణలో భాగంగా కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇది మా జీవితాలను మార్చుకునేలా ఉపయోగపడుతుంది. సెర్ప్ నుంచి రుణం మంజూరు కాగానే సేవలను మరింతగా విస్తరిస్తాం.

– గుగులోతు స్వప్న, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, చింతగుర్తి, రఘునాథపాలెం మండలం

దేశానికి ఆదర్శంగా నిలిచేలా..



దేశవ్యాప్తంగా డీఐసీఎస్‌సీ ప్రాజెక్టులో పైలట్‌గా ఎంపిక చేసిన జిల్లాల్లో ఖమ్మం ఉంది. ఎస్‌హెచ్‌జీలతో సీఎస్‌సీలు నిర్వహించేలా శిక్షణ అందించాం. ఇందుకు సెర్ప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం. తద్వారా సభ్యులకు ఉపాధి, గ్రామీణులకు డిజిటల్ సేవలు వేగంగా అందిస్తూ జిల్లాను దేశంలోనే ఆదర్శంగా నిలుపుతాం.

– డాక్టర్ విగ్నేష్ సోర్ణమోహన్, స్టేట్ హెడ్, సీఎస్‌సీ

'యూరియా'పై నిఘా

- సరఫరాను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ శాఖలు
- సహకార అధికారులకు మానిటరింగ్ బాధ్యత
- ఉమ్మడి జిల్లాకు 2,646 మెట్రిక్ టన్నులు



పందిళ్లపల్లి రేక్ పాయింట్‌లో ఎరువుల వ్యాగన్ వద్ద మార్క్‌ఫెడ్ అధికారులు

ఖమ్మంవ్యవసాయం : యూరియా సరఫరాపై ప్రభుత్వం నిఘా పెంచింది. పలు ప్రాంతాల్లో రైతులకు యూరియా లభించక ఇబ్బంది పడుతున్నారు. సహకార సంఘాల్లో నిల్వ లేకపోవడంతో రైతులు పరుగులు తీస్తున్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న వేళ.. పంటలకు ఎరువుల వినియోగం పెరిగింది. ప్రధానంగా యూరియా కోసం రైతులు ఆరాట పడుతున్నారు. పలుచోట్ల సరిపడా లభ్యం కాక ఆందోళన కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో యూరియా పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించింది. పక్కదారి పట్టకుండా నిఘా పెంచింది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు, పోలీసులు ఎరువుల పంపిణీని పర్యవేక్షిస్తుండగా, తాజాగా సహకార శాఖ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అంతేకాక మార్క్‌ఫెడ్, వ్యవసాయ, సహకార జిల్లా స్థాయి అధికారుల బృందం కూడా ఎరువుల నిల్వలను, పంపిణీని తనిఖీ చేస్తోంది.

ఉన్నతాధికారులకు నివేదికలు..

యూరియా కొరత, సరఫరాలో చోటు చేసుకుంటున్న ఇబ్బందులను అధిగమించటం, రైతులకు సక్రమంగా ఎరువును అందించటం లక్ష్యంగా సహకార శాఖలో పనిచేస్తున్న జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు సహకార సంఘాల్లో ఎరువుల పంపిణీపై మానిటరింగ్ బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం జిల్లాలో 25 మంది సహకార అధికారులు కేటాయించిన సహకార సంఘాల్లో ఎరువుల నిల్వలు, పంపిణీకి తీసుకుంటున్న చర్యలు, అవసరాలు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. అంతేగాక సరఫరా అవుతున్న యూరియా సక్రమంగా రైతులు వినియోగిస్తున్నారా..?, పక్కదారి పడుతుందా..? వంటి అంశాలను కూడా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అంతేగాక జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టులపై కూడా దృష్టిసారించారు. వీరితో పాటు వ్యవసాయ, పోలీసు యంత్రాంగం యూరియా విక్రయాలను తనిఖీలు చేస్తుంది.

ఉన్నతాధికారుల తనిఖీలు..

యూరియా సరఫరాను ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు తనిఖీ చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఉన్న నిల్వలు, రేక్ పాయింట్‌కు వచ్చిన యూరియా, అక్కడ నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సరఫరా, సహకార సంఘాల్లో విక్రయాలు, నిల్వలను మార్క్‌ఫెడ్ జీఎం విష్ణువర్ధన్, ఉమ్మడి జిల్లా మేనేజర్ సునీత, జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, డీసీఓ జి. గంగాధర్ రెండు రోజులుగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే కూసుమంచి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, ఖమ్మం రూరల్ తదితర మండలాలతో పాటు భద్రాద్రి జిల్లాలోని చంద్రుగొండ, కొత్తగూడెం తదితర మండలాల్లో నిల్వలను పరిశీలించారు.

ప్రాధాన్యతా క్రమంలో సరఫరా..

జలాశయాల్లో నీరు, ప్రధానంగా సాగు చేసే పంటలు, వాటికి ప్రస్తుతం అవసరమైన యూరియా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యతా క్రమంలో యూరియా సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఇప్పటికే సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో లక్ష్యం మేరకు వరి సాగు చేశారు. మిగతా ప్రాంతాల్లో సాగు పనులు సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని తాలిపేరు, కిన్నెరసాని వంటి ప్రాజెక్టుల కింద వరి, ఇతర పంటలు సాగు చేస్తుండగా ఆయా ప్రాంతాలకు యూరియా సరఫరాపై చర్యలు చేపట్టారు.

రేక్ పాయింట్‌కు చేరిన యూరియా..

చింతకాని: ఉమ్మడి జిల్లాకు ఆదివారం 2,646 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది. ఎన్‌ఎఫ్‌ఎల్(నేషనల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ లిమిటెడ్)కు చెందిన యూరియా మండలంలోని పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు చేరింది. దీన్ని పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసి, అక్కడ నుంచి రైతులకు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం వచ్చిన 2,646 మెట్రిక్ టన్నుల్లో ఖమ్మం జిల్లాకు 1,446, భద్రాద్రి జిల్లాకు 1,200 మెట్రిక్ టన్నులు కేటాయించారు. జిల్లాకు కేటాయించిన 1,446 టన్నుల్లో మార్క్‌ఫెడ్‌కు 867.6 టన్నులు, ప్రైవేటు డీలర్లకు 578.4 టన్నులు సరఫరా చేశారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి కల్యాణక్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. సెలవు రోజు కావడంతో పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్



మాట్లాడుతున్న సురేంద్రమోహన్, పక్కన అధికారులు

రఘునాథపాలెం : యూరియా, డీఏపీ సహా ఇతర ఎరువులన్నీ రైతులకు ఎమ్మార్పీకే విక్రయించాలని, బ్లాక్ పేరుతో అధిక ధరలకు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ హెచ్చరించారు. రఘునాథపాలెం మండలం వీవీపాలెం సహకార సొసైటీలో ఎరువుల విక్రయాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ డీలర్ దుకాణాల్లో స్టాక్ బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. రైతులకు సకాలంలో, సరిపడా ఎరువులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, వ్యవసాయ టెక్నికల్ అధికారి పవన్ కుమార్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు, ఉపాధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాసరావు, సీఈఓ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ నిర్మాణాలు ఆదర్శంగా ఉండాలి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిర్మిస్తున్న మిర్చి మోడల్ మార్కెట్ పనులు ఆదర్శంగా ఉండాలని సురేంద్రమోహన్ అన్నారు. ఆదివారం ఆచప మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఖమ్మంలో మిర్చి మోడల్ మార్కెట్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని, మార్కెట్ యార్డులతో పాటు కోల్డ్ స్టోరేజీ, రైతుల విశ్రాంతి భవనం, మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాల పనుల్లో నాణ్యత పాటించాలని అన్నారు. మిర్చి సీజన్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, డీఎంఓ ఎంఏ అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ వైఖరితో సెక్యులరిజానికి ముప్పు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నేలకొండపల్లి : కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలతో సెక్యులరిజానికి పెను ముప్పు పొంచి ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మండలంలోని మోటాపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయ వ్యవస్థను సైతం తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు. నిత్యం మత ఘర్షణలు సృష్టిస్తూ ఓట్ల రాజకీయం చేస్తోందని, ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు కాకుండా కుట్ర పన్నుతోందన్నారు. దేశంలో ఏనాడూ బీసీల సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్.. బీసీ రిజర్వేషన్ల పేరుతో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను విస్మరించిందని, అమలు కానీ హామీలతో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో హడావిడి చేస్తోందని విమర్శించారు. సమావేశంలో పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, కేవీ.రెడ్డి, రాజశేఖర్, సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, రచ్చా నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, ఏటుకూరి రామారావు, భూక్యా కృష్ణ, ఇంటూరి అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల జోలికి వెళ్లొద్దు
- ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ
- యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం
- రెండు జిల్లాల అధికారుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీహరి, తుమ్మల, పొంగులేటి



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు శ్రీహరి, తుమ్మల, పొంగులేటి, ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల దరి చేర్చాలని సూచించారు. వరద ముంపు, సహాయక చర్యలు, సంక్షేమ పథకాలు, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అధికారులతో ఆదివారం కొత్తగూడెంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల వద్దకు వెళ్లొద్దని అటవీ, పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మూడేళ్లపాటు రూ.12,600 కోట్లతో ఇందిరా గిరి జలవికాసం ద్వారా సోలార్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 వేల కోట్లతో ప్రణాళిక సిద్ధం చేయగా, ఎమ్మెల్యేలు ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ప్రతిపాదనలు ఇవ్వడంలో ఆలస్యమవుతోందని అన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు చేపడతామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. మహిళా సంఘాల ద్వారా చేప పిల్లల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోదావరి వరదలు ఇప్పటివరకు సాధారణ స్థితిలో ఉన్నాయని అన్నారు. వన మహోత్సవంలో ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటాలని, గత పదేళ్లలో నాటిన, బతికిన మొక్కల వివరాలు అందించాలని ఆదేశించారు. సంక్షేమ, గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని అన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రభుత్వ పథకాలు ప్రజల దరి చేరేలా అధికారులు, ప్రజాప్రతిధులు సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యాభివృద్ధికి మలుపు తిప్పే కార్యక్రమమని అన్నారు. ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల కార్యకమాన్ని చేపడతామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువు గట్లపై చేప పిల్లల పెంపకం, ఖర్చు తదితర వివరాలతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతి ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు నాటేలా చూడాలన్నారు.

అభివృద్ధిలో మోడల్‌గా మార్చాలి

రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో మోడల్‌గా తీర్చిదిద్దాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై కట్టుబడి ఉందన్నారు. వరదలు, వర్షాలకు సంబంధించిన అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

సంక్షేమ లక్ష్యాన్ని సాధించాలి

అధికారులు ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాన్ని సాధించేలా పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆగస్టు నెలలో శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరా చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ శాఖల పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల వెంట ఏర్పడిన గుంతలను పూడ్చాలని చెప్పారు. వర్షాకాలం నీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రులు, వసతి గృహాల పర్యవేక్షణ కోసం నియోజకవర్గాలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, టీజీ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం కలెక్టర్ అనుదీప్, భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా సర్వేయర్ల పరీక్షలు



పరీక్ష కేంద్రంలో సామగ్రితో సిబ్బంది

ఖమ్మంసహకారనగర్: భూ భారతి చట్టం అమల్లో భాగంగా గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించే క్రమంలో వారికి గత 50 రోజులుగా అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం థియరీ, మధ్యాహ్నం ప్లాటింగ్ పరీక్షలకు 587 మందికి గాను 442 మంది హాజరు కాగా 75.30 శాతం నమోదైంది. కాగా పరీక్షలను సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, సీపీఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారిణి

కల్లూరు: కల్లూరులోని మినీస్టేడియంలో ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్–8, 10, 12, 14, 16 బాలబాలికలకు అథ్లెటిక్స్‌లో విడివిడిగా క్రీడా పోటీలు నిర్వహించారు. 60 మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఐదు మీటర్ల అప్రోచ్ లాంగ్ జంప్, కిడ్స్ జావలెన్ త్రో పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన వారు ఆగస్టు 7వ తేదీన జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు. క్రీడాకారులు, తల్లిదండ్రులకు భోజన వసతి కల్లూరు లయన్స్‌క్లబ్ బాధ్యులు చలువాది నగేశ్, ఇందోజు రమేశ్, కిన్నెర ఆనంద్ కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షఫిక్‌అహ్మద్, బి.రవికుమార్, ప్రియాంక, స్టేడియం ఇన్‌చార్జ్ పసుపులేటి వీరరాఘవయ్య, కోచ్‌లు కంద్రాతి రాధాకృష్ణ, సీహెచ్ త్రివేణి, గౌతమ్ రెడ్డి, గోపి, సతీశ్‌కుమార్, ఫిజికల్ ట్రైనర్ ఎన్.నాగబాబు, 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి..

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారాం



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న సీతారాం

సత్తుపల్లిరూరల్: వ్యాధులు ప్రబలకుండా అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ నియంత్రణ చర్యలు చేపట్టాలని సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారాం అన్నారు. ఆదివారం గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించి, మాట్లాడారు. గ్రామాల్లో ముమ్మరంగా సర్వే నిర్వహించాలని, ప్రతి జ్వరం కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్.అవినాష్, స్పందన, సూపర్‌వైజర్ శారారాణి, ఫార్మాసిస్ట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి



బోనకల్‌లో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు, రామారావు

బోనకల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, డీఎల్‌పీఓ రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, తూటికుంట్ల గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశుద్ధ్య పనులు, ఫీవర్ సర్వేను పరిశీలించారు. ముష్టికుంట్లలోని పల్లె దవాఖానలో రికార్డులు, అనంతరం పారిశుద్ధ్య పనులు, బోనకల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపీ, స్టాక్ రిజిస్టర్లు, తూటికుంట్లలో ఇంటింటి ఫీవర్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి, వైద్యాధికారి ప్రవంతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

ఉండలేక.. కట్టలేక !

పక్కా ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులు

- ఆంక్షలతో అడ్డుపడుతున్న అటవీ అధికారులు
- గుడిసెల్లో ఉండలేక తుమ్మలనగర్ గిరిజనుల అవస్థలు
- ఇందిరమ్మ ఇళ్లు వచ్చినా అడ్డుకుంటున్నారని ఆగ్రహం



తుమ్మలనగర్ వ్యూ

సత్తుపల్లి: ముప్పై ఏళ్లుగా గుడిసెల్లోనే జీవితం.. తాగునీళ్లు లేవు.. రోడ్లులేవు.. దోమలు, ఈగలతోనే సావాసం చేయాల్సిన దుస్థితి.. కరెంట్ కోసం తిరిగితే సత్తెమ్మతల్లి గుడి నుంచి ఒక లైను వేశారు.. ఈ కష్టాలన్నీ ఓ కొలిక్కి రాగా, గుడిసెల్లో ఉండలేని పరిస్థితి ఎదుర్కొంటున్న తమను అటవీ అధికారులు మరింత ఇబ్బంది పెడుతున్నారని సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీ తుమ్మలనగర్ గిరిజనులు వాపోతున్నారు. ఇక్కడ సుమారు 50 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గతంలో తుమ్మలనగర్ వెనుకాల మూడు కి.మీ. దూరంలో అటవీప్రాంతంలో ఉండేది. రవాణా, విద్యుత్, రోడ్డు, మంచినీటి సౌకర్యాలు లేకపోవటంతో చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 22లో 11 ఎకరాలలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఇవి కూడా వర్షానికి తడుస్తున్నాయి.. కప్పుకుందామన్నా ఆంక్షలతో అడ్డుకుంటున్నారని గిరిజనులు వాపోతున్నారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఉన్నా..

ఎన్నో ఆందోళనలు, విజ్ఞప్తులు, పోరాటాల ఫలితంగా 48 కుటుంబాలకు ప్రభుత్వం 2022లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను అందించింది. గుడిసెలో ఉంటున్న ప్రదేశాన్ని లెక్కకట్టి ఒక్కొక్కరికి రెండు, మూడు, నాలుగు కుంటలు చొప్పున పట్టాలను రెవెన్యూ, అటవీశాఖ అందించింది. అయితే ఇళ్లను బాగు చేయించటం కానీ.. నూతనంగా నిర్మించటం కానీ.. రేకులు వేయించుకోవటం కానీ చేసుకోవటం కుదరదని అటవీశాఖ మెలిక పెడుతుంది. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఉద్దేశం సాగు చేసుకోవాలని ఉందని.. కుంట, రెండు కుంటల్లో సాగు ఎలా చేస్తారంటూ గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఇళ్లల్లో ఉన్నట్టు రికార్డుల్లో నమోదు చేసుకొని ఇప్పుడు ఇళ్లు బాగు చేసుకోవద్దంటూ ఎలా అంటూ నిలదీస్తున్నారు. అదీగాక 150 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు.



నిలిచిపోయిన ఊకే రత్తమ్మ ఇల్లు

నిర్మాణాలు అడ్డగింత

చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని తుమ్మలనగర్‌కు చెందిన తాటి వీరభద్రం, ఊకే రత్తమ్మలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. తాటి వీరభద్రం ముగ్గు వేస్తుండగానే అటవీశాఖ సిబ్బంది నిలిపివేసింది. ఊకే రత్తమ్మ పునాదుల వరకు నిర్మించిన పనులను నిలిపివేశారు. తుమ్మలనగర్‌లో నివాసం ఉంటున్న 48 కుటుంబాలలో ఒక్కొక్కరి గుడిసెలో ఇద్దరేసి, ముగ్గురేసి కుటుంబాలు ఉండాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ఎలా అడ్డుకుంటారంటూ గిరిజనులు వాపోతున్నారు. అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా జాయింట్ సర్వే చేస్తే చెరుకుపల్లి సర్వే నంబరు 22లోని భూమి రెవెన్యూ భూమిగా తేలుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ముగ్గు వేయగానే నిలిపివేశారు..



ఇందిరమ్మ ఇళ్లు వచ్చిందని సంబరపడ్డాం. ఇంటి నిర్మాణం కోసం ముగ్గు వేశాం. అటవీశాఖ సిబ్బంది వచ్చి నిలిపివేశారు. ఇల్లు కట్టుకోవటం కుదరదని చెప్పి వెళ్లారు. మా గుడిసెలో ఇప్పటికే మూడు కుటుంబాలు ఉంటున్నాం.

– తాటి సారిక, తుమ్మలనగర్

అది అటవీశాఖ భూమే..



చెరుకుపల్లి పంచాయతీలోని తుమ్మలనగర్ అటవీశాఖకు చెందిన భూమి. దీంట్లో ఎలాంటి పక్కా నిర్మాణాలకు అనుమతులు లేవు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చట్టాలు ఉన్నాయి. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల ఉద్దేశం ఇంటి నిర్మాణాలు చేపట్టకూడదు. – వాదపల్లి మంజుల, ఎఫ్‌డీఓ, సత్తుపల్లి

'రైల్ వన్' లాభాలెన్నో..

- ప్రయాణికులకు అందుబాటులో రైల్ వన్ యాప్
- జూలై 1 నుంచి సేవలు అమల్లోకి..



వైరా: రైలు ప్రయాణమంటే ఒక ప్రహసనమే.. ప్రస్తుతం రైల్వే శాఖ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి రైల్ వన్ అనే యాప్‌ను రైల్వే శాఖ ప్రవేశ పెట్టింది. ప్రయాణికులకు కావాల్సిన సమాచారం అంతా ఒకే యాప్‌లో లభిస్తుందని ఇండియన్ రైల్వే శాఖ చెబుతోంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులకు అన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

● టికెట్‌కు ఇబ్బంది లేదు..

ఈ యాప్ నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చు. అత్యవసరంగా అన్ రిజర్వు టికెట్ కూడా వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ప్లాట్ ఫామ్ టికెట్ సైతం పొందవచ్చు.

● రైళ్ల కోసం..

మనం వెళ్లాల్సిన ప్రాంతానికి ఏ రైళ్లు అందుబాటులో ఉన్నాయని వెతికేందుకు సెర్చ్ ట్రెయిన్స్ బటన్ ఉంటుంది. ఏ ప్లాట్ ఫామ్‌పై రైలు ఆగుతుంది? కోచ్ పొజిషన్ ఎక్కడ ఉందో కూడా తెలుసుకోవచ్చు. రైలు ఎక్కడ ఉంది? ఎప్పుడు వస్తుందని ట్రాక్ యువర్ ట్రెయిన్ ద్వారా తెలుసుకోవచ్చు.

● రిజర్వేషన్ ఇలా..

ఇందులో పీఎన్‌ఆర్ స్థితిని తెలుసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ టికెట్, సీటు కన్ఫర్మేషన్ స్టేటస్ తెలుసుకోవచ్చు. ట్రెయిన్ క్యాన్సిల్, రిజర్వేషన్ క్యాన్సిల్ వంటి అంశాలను కూడా ఇందులో తెలుసుకోవచ్చు.

● సీటు వద్దకే ఆహారం..

మనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసుకునేలా అవకాశం ఉంది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం ద్వారా వివిధ రైల్వే స్టేషన్లకు చేరుకునే ముందే మనకు నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకుంటే మీరు ప్రయాణిస్తున్న ట్రెయిన్‌లో మీసీటు వద్దకే తెచ్చి ఇచ్చే సౌకర్యం ఉంది.

సూచనలు, ఫిర్యాదులు..

రైల్వే శాఖకు ఏమైనా సూచనలు ఇవ్వాలి అనుకున్నా.. ట్రెయిన్‌లో ప్రయాణించే సమయంలో సమస్యలు తలెత్తినా ఫిర్యాదు చేయడానికి ఇదే యాప్‌లో రైల్ మదత్ విభాగం అందుబాటులో ఉంది. ఫిర్యాదు చేసిన కొద్ది సమయంలోనే రైల్వేశాఖ సిబ్బంది సమస్యకు పరిష్కారం చూపుతారు.

● డౌన్‌లోడ్ ఇలా..

మొబైల్ ఉపయోగించే వారికి ఎంతో ఉపయోకరంగా ఉండే ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాపిల్, ఐఓఎస్, యాపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత సెల్ నంబర్ లేదా మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని పాస్‌వర్డ్ పెట్టుకోవడం ద్వారా ఉపయోగంలోకి వస్తుంది.

'ఆర్యవైశ్యులకు అండగా కాంగ్రెస్'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆర్యవైశ్యులకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని.. తెలంగాణ ఇచ్చింది కూడా ఆ పార్టీయేనని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. వైరాలోని హరిహర సుత అయ్యప్ప స్వామి మండపంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్యుల రాజకీయ చైతన్య ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలవడంలో ఆర్యవైశ్యుల సహకారం ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ నాయకుడు రాకేశ్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మిడిదొడ్డి శ్యాంసుందర్, రాయల నాగేశ్వరరావు, కొదుమూరి దయాకర్, కొత్తా వెంకటేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, శీలం నర్సిరెడ్డి, సీతారాములు, వెంకటేశ్వరరావు, రంగా జనార్దన్, మిట్టపల్లి రాఘవరావు, గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాసరావు, ఉపేందర్‌రావు, రాము, భాస్కరరావు, రవికుమార్, నాగేశ్వరరావు, ఈశ్వరి, నాగశ్రీలత, రోజా, మంజులకుమారి, శబరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో బ్యాంకు అభివృద్ధి

భద్రాద్రి బ్యాంక్ 28వ వార్షికోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు, పక్కన చెరుకూరి కృష్ణమూర్తి

ఖమ్మంగాంధీచౌక్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటం ద్వారా బ్యాంకు అభివృద్ధి పథంలో నిలుస్తుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు అన్నారు. భద్రాద్రి అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ 28వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు తొలుత వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజల్వనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన సాంకేతిక విధానాలను పాటిస్తూ ఖాతాదారులకు ప్రయోజనకరమైన సేవలు అందిస్తే బ్యాంకు మరింతగా విస్తరిస్తుందని తెలిపారు. జిల్లా సహకార అధికారి గంగాధర్ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో సహకార వ్యవస్థ కీలకమని, అన్ని వర్గాల ప్రజలకు సహకార రంగాలు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కృష్ణమూర్తి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను వినిపించారు. అంతేగాక 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. గడిచిన ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంకు రూ.598.96 కోట్ల డిపాజిట్లను కలిగి ఉందని, రూ.365.99 కోట్లను పలు రూపాల్లో రుణాలుగా ఇచ్చామని, ఈ ఏడాది నూతనంగా 6 శాఖలను ప్రారంభించి మొత్తం 23 శాఖలతో వినియోగదారులకు సేవలందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకుగా అనుమతులు పొందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్‌లు సన్నె ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు దేవత రాజారావు, బలుసు సాంబమూర్తి, మద్ది పిచ్చయ్య, రాజ్ పురోహిత్ చైన్‌సింగ్, వైవీఎస్ రావు, రంగానాగా శ్రీనివాసరావు, దారా జీవన్‌రాం, కర్లపూడి నర్మద, కిలవాయి జయప్రద, బోర్డ్ మేనేజ్‌మెంట్ సభ్యులు సీజీ శాస్త్రి, పైడిమర్రి సత్యనారాయణ, ప్రొఫెసర్ పసుమర్తి మధుసూదన్‌రావు, బ్యాంకు అన్ని శాఖల మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్‌లో డెంగీ కేసు

బోనకల్: మండల కేంద్రంలో బీటెక్ చదివే ఓ విద్యార్థికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నివాసం ఉంటున్న విద్యార్థి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. వారం రోజుల కిందట అతను బోనకల్ వచ్చాడు. జ్వరం రావడంతో పీహెచ్‌సీలో రక్తపరీక్షలు చేయించుకోగా డెంగీ పాజిటీవ్‌గా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఆదివారం సెలవుదినం అయినప్పటికీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ



ఘటనా స్థలంలో రాజశేఖర్

కామేపల్లి: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి గాయాలైన ఘటన ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సింగరేణి మండలం గిద్దవారిగూడెంనకు చెందిన గుగులోత్ రాజశేఖర్, రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన కేలోత్ మంగీలాల్ బైక్‌పై ఖమ్మం వైపు వెళ్తుండగా ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెద్ద రాళ్లను తొలగించాలి

రాకాసితండా వాసుల వేడుకోలు



సీతారామ అక్విడెక్ట్‌కి అడ్డుగా ఉన్న పెద్ద బండరాళ్లు

తిరుమలాయపాలెం: గతేడాది భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా వాసులు ఆకేరు ప్రవాహం పెరుగుతుంటే ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం ఆకేరుపై సీతారామ నీళ్లు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన అక్విడెక్ట్ వద్ద కాంట్రాక్టు నిర్మాణ సంస్థ తమ పొక్లెయిన్‌లు, టిప్పర్లు వెళ్లేందుకు పెద్దపెద్ద బండరాళ్లను వేసి అలాగే వదిలివేశారు. దీంతో గతేడాది ఆకేరు ప్రవాహం పెరిగి నీళ్లు వెళ్లే మార్గం లేక రాకాసితండాను చుట్టుముట్టి తీవ్ర నష్టం జరిగింది. ఆ నాటి నుంచి ఇప్పటి వరకు అక్విడెక్ట్‌కి అడ్డుగా ఉన్న బండరాళ్లు తొలగించకపోవడంతో గ్రామస్తులు ఇటీవల మండల ఎస్‌ఐ జగదీశ్ దృష్టికి తీసుకెళ్లి, చూపించారు. ఆకేరుకు భారీగా వరద వస్తే రాకాసితండాకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్విడెక్ట్‌కి అడ్డుగా ఉన్న బండరాళ్లను తొలగించాలని కోరుతున్నారు.

పేకాట స్థావరాలపై దాడి

కారేపల్లి: పేకాట స్థావరాలపై కారేపల్లి పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్‌ఐ బి.గోపి ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉసిరికాయపల్లి శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ సమీపంలోని గుట్టల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. ఈ క్రమంలో పేకాట స్థావరాలపై దాడి చేసి ఇల్లెందు పట్టణానికి చెందిన 12 మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 6 ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్లు, రూ.25,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు భూక్య శంకర్, హరి, ఓంకార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో విఫలం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా ప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, ఎస్.అనిల్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మా ట్లాడారు. ప్రభుత్వం విద్య పరిరక్షణ కోసం నిధులు కేటాయించకుండా గత ప్రభుత్వాల మాదిరిగానే వ్యవహరిస్తోందని, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, స్కిల్ యూనివర్సిటీ పేరుతో మాట్లాడుతున్న ప్రభు త్వ పెద్దలు కమీషన్ల కోసం మాత్రమే వాటిని ముందుకు తీసుకొస్తున్నారు తప్ప రాష్ట్రంలో గురుకుల విద్య, పాఠశాల విద్యలో మౌలిక వసతులు మెరుగుపరిచి సొంత బిల్డింగ్ ఏర్పాటు చేసే ఆలోచన చేయకపోవడం సిగ్గుచేట అని పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.లక్షలు వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించలేక పోతున్నారని ఆరోపించారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

రఘునాథపాలెం: గడ్డిమందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన ఘటన రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. డోర్నకల్ మండలం తోడేళ్లగూడేనికి చెందిన అల్లి ఉమ కుమార్తె స్వాతికి మూడేళ్ల కిందట రామకృష్ణతో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. వివాహానికి ముందే స్వాతి కడుపునొప్పితో బాధపడుతుండగా పెళ్లి తరువాత తలనొప్పి కూడా ప్రారంభమై ఇబ్బంది పడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల 30న ఇంట్లో గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖమ్మంలో చోరీ చేస్తే దొరికిపోతామని..

- సూర్యాపేటను ఎంచుకున్న దుండగులు
- బంగారం దోపిడీ కేసులో మహిళ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

సూర్యాపేటటౌన్: సూర్యాపేటలోని సాయి సంతోషి జ్యువెలరీ షాపులో ఈనెల 21న జరిగిన బంగారం దోపిడీ కేసులో ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు గతంలో ఖమ్మంలో చోరీ చేసి పట్టుబడ్డాడు. దీంతో ఖమ్మంలో చోరీ చేస్తే దొరికిపోతామని గ్రహించి సూర్యాపేటలో దొంగతనానికి స్కెచ్ వేశాడు. చోరీ కేసుని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ నరసింహ 5 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసింది నేపాల్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ముఠాగా గుర్తించారు. ప్రత్యక్షంగా ఐదుగురు నిందితులు దొంగతనంలో పాల్గొనగా వారికి సహకరించింది మరో ఇద్దరని గుర్తించారు. దొంగతనంలో సహకరించిన యశోదను అరెస్ట్ చేశారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆదివారం సూర్యాపేట హైటెక్ బస్టాండ్ సమీపంలో పోలీసులు ఫింగర్ ప్రింట్స్ తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఖమ్మంలోని నాయుడుపేటకు చెందిన మేకల యశోద బ్యాగును పరిశీలించగా శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో చోరీకి గురైన కొన్ని ఆభరణాలు లభ్యమయ్యాయి. ఖమ్మం పట్టణంలో నేపాల్‌కు చెందిన ఏ–6 నిందితుడైన అమర్‌బట్ గూర్ఖాగా పనిచేస్తుండేవాడు. ఈ కేసులో ఏ–1 నిందితుడు, నేపాల్‌కు చెందిన ప్రకాష్‌అనిల్‌కుమార్.. ఖమ్మంలో ఉంటున్న అమర్‌బట్ వద్దకు వచ్చి గూర్ఖాగా పనిచేస్తూ యశోదతో సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఖమ్మంలో చోరీ చేస్తే దొరికిపోతామని, సూర్యాపేట పట్టణాన్ని ఎంచుకున్నారు. ప్రకాష్ అనిల్‌కుమార్‌కు తెలిసిన మరో వ్యక్తి నేపాల్‌కు చెందిన కడాక్ సింగ్‌తోపాటు, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ముగ్గురిని పిలిపించుకుని చోరీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. మేకల యశోదతో కలిసి సూర్యాపేట ఎంజీ రోడ్డులోని బంగారం షాపు వెనుక ప్రాంతంలో యజమాని లేని ఇంట్లో ఒక రూంను అద్దెకు తీసుకుని, రెక్కీ చేసి, శ్రీసాయి సంతోషి జ్యువెలరీలో షాపులో చోరీ చేశారు. తర్వాత బంగారం ఇక్కడ అమ్మితే అనుమానం వస్తుందని నేపాల్‌కు తీసుకెళ్లి అమ్ముదామని ఐదుగురు నిందితులు నిర్ణయించారు. నిందితురాలు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యక్షంగా చోరీకి పాల్పడిన నేపాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మొత్తం ఐదుగురిని గుర్తించామని ఎస్పీ తెలిపారు. ఏ–1 నిందితుడైన ప్రకాష్ అనిల్ కుమార్‌పై గతంలో ఖమ్మం జిల్లాలో మూడు దొంగతనం కేసులు ఉన్నాయని, మిగిలిన నిందితులపై ఉన్న పాత కేసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితురాలి నుంచి 14 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు.